
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
3
గురువారం 11 జనవరి 2024



కొండగట్టు హుండీ లెక్కింపులో చేతివాటం 5లో..
నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి 6లో..

నూనెగింజల ఎగుమతి

రైతుల చైతన్యంతో



స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

- యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ రఘురామరెడ్డి
- పొలాస పరిశోధన స్థానంలో నిర్వహించిన కిసాన్ మేళా సక్సెస్
- భారీగా తరలివచ్చిన రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు
- ఆకట్టుకున్న స్టాళ్లు ..
- ప్రారంభించి పరిశీలించిన కలెక్టర్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 10: రైతుల చైతన్యంతోనే నూనెగింజల విదేశీ ఎగుమతులకు అవకాశం ఉంటుందని యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ రఘురామరెడ్డి అన్నారు. పొలాస గ్రామంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం (పొలాస)లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కిసాన్ మేళా(నువ్వులు)-2024 పేరుతో రైతులు, శాస్త్రవేత్తలతో చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ రఘురామరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణలో తెల్ల నువ్వుల సాగు 50వేల ఎకరాల్లో సాగవుతుందని, కేవలం యాసంగి పంటగా మాత్రమే నువ్వులను సాగు చేస్తున్నారన్నారు. యాసంగి సాగుతో పంట నాణ్యత పెరుగుదలతో పాటు, దిగుబడి పెరుగుతుందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో నల్ల నువ్వుల సాగు అధికంగా ఉండేదని, ప్రస్తుతం తెల్ల నువ్వులు సాగవుతుందన్నారు. పొలాస పరిశోధన స్థానంలో నువ్వుల యూనిట్ పెట్టామని, రైతులు, ఎఫ్‌పీవోలు సేవలు వినియోగించుకోవచ్చన్నారు. విదేశాలకు ఎగుమతి చేయాలంటే యాజమాన్య పద్ధతులు పాటించి సాగు చేయడం ద్వారా లాభాలు ఆర్జించవచ్చన్నారు. ప్రధానంగా పురుగు మందుల అవశేషాలను తగ్గిస్తే ఆయా దేశాల నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగా పంటల ఎగుమతులకు ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు, సూచనల ద్వారా నాణ్యతతో కూడిన పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టాలన్నారు. భిన్నమైన పంటల సాగు వైపు మరలాల్సిన రైతులు, సులువైన సాగు విధానం అయిన వరి పంట సాగు వైపు అడుగులు వేస్తుండడం ఇబ్బందికరంగా మారిందన్నారు.

ఆయిల్ దిగుమతులు పెరుగుతున్నందన రైతులు తమ అవసరాలకు అనుగుణంగా అవసరమైన పంటలు సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు కూడా ఒక వ్యాపార ధృక్పతంతో పంటలను సాగు చేయాలని, వ్యాపారిలాగా మారాలన్నారు. రైతులంతా సంఘటి తంగా ఉండి, మేలైన రకాల పంటల సాగు దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రతి రైతు కనీసం తన కుటుంబ అవసరాల కోసమైన కనీసం కూరగాయలు సాగు చేసుకోవాలన్నారు. డిమాండ్ ఉన్న పంటలు సాగుచేసి లాభాలు ఆర్జించాలని పిలుపునిచ్చారు. అనంతరం కిసాన్ మేళాలో భాగంగా వివిధ పబ్లిక్, ప్రైవేట్ కంపెనీలకు చెందిన పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, కొత్త సాంకేతిక ప్రదర్శనలతో కూడిన 45 స్టాళ్లను ఏర్పాటు చేయగా ప్రారంభించిన కలెక్టర్, అనంతరం వాటిని పరిశీలించి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నూనెల ఉత్పత్తి సంస్థల ప్రతినిధులు కిషోర్ ధాన, డాక్టర్ ఆనంద్ విశ్వకర్మ, యస్‌వి రమణరావు, అఖిల భారత నూనె గింజల పరిశోధనా స్థానం హైద్రాబాద్, యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, నూనె గింజల ప్రధాన శాస్త్రవేత్త వాణిశ్రీ, శాస్త్రవేత్తలు రజినీ, పద్మజ, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్‌తో పాటు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు

జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక జరపాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన ఇన్‌చార్జి ఛైర్మన్

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యేడాది కాలంగా ఖాళీగా ఉన్న జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవికి ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాకు ఇన్‌చార్జి మున్సిపల్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ బుధవారం వినతిపత్రం అందించారు. జగిత్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించిన బోగ శ్రావణి రాజీనామా చేసిన తదుపరి వైస్ ఛైర్మన్‌గా ఉన్న తాను ఇన్‌చార్జి ఛైర్మన్‌గా 2023 జనవరి 31వ తేదిన బాధ్యతలు చేపట్టానని వివరించారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఛైర్మన్ కోసం తగిన చర్యలు తీసుకొని యథావిధంగా వైస్ ఛైర్మన్ బాధ్యతలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి

జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ ఆడెపు భాస్కర్

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి టీచర్లు సమయ పాలన పాటించాలని జిల్లా సంక్షేమ అధికారి, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ ఆడెపు భాస్కర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎల్‌జీ గార్డెన్స్‌లో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, మేడిపల్లి, రాయికల్ మండలంలోని అంగన్ వాడీ టీచర్లకు ప్రాజెక్టు స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. అంగన్ వాడీ కేంద్రంలలో ప్రీ స్కూల్ విద్య సంక్రమంగా షెడ్యూల్ ప్రకారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వీరలక్ష్మీ, సూపర్‌వైజర్లు జానకి, స్వరూపరాణి, భాగ్యలక్ష్మీ, లావణ్య, రాధ, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ మధు, బ్లాక్ కో ఆర్డినేటర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను కొనసాగించాలి

కలెక్టర్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ఆందోళన

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 10: గత ప్రభుత్వం ఇచ్చిన గృహలక్ష్మి ప్రొసీడింగ్స్‌ను యధావిధిగా కొనసాగించాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు లబ్దిదారుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ ఆధారంగా కొంత మంది లబ్దిదారులు నూతన గృహ నిర్మాణ పనులను చేపట్టారన్నారు. కావున ప్రొసీడింగ్‌లను యధావిధిగా కొనసాగించాలని కోరారు. లేని పక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం గ్యారంటీలలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ దివాకరన్‌ను కలిసి పై అంశంపై వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల నియోజకవర్గ ఆయా గ్రామాల వార్డుల గృహలక్ష్మీ లబ్దిదారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

28 మంది మినీ అంగన్‌వాడీలకు పదోన్నతి

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 28 మంది మినీ అంగన్ వాడీ టీచర్లు పదోన్నతి పొందడం పట్ల కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అభినందించారు. బుధవారం పట్టణంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ ఆడెపు భాస్కర్‌తో పాటు పలువురు మినీ అంగన్ వాడీలు కలెక్టర్‌ను కలిశారు. జీవో నం 37 ప్రకారం మినీ అంగన్ వాడీ టీచర్లకు మెయిన్ అంగన్ వాడీ టీచర్లకు పదోన్నతి కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి పంపిణీ చేశారు.

దళిత మహిళ ఎంపీపీగా ఉండడం నచ్చదా..?

- ప్రెస్‌మీట్‌లో కంట తడి పెట్టుకున్న ఎంపీపీ

వెల్గటూర్, జనవరి 10: ఒక దళిత మహిళ ఎంపీపీగా ఉండడం మీకు నచ్చదా? అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎంపీపీ కూనమల్ల లక్ష్మి ప్రశ్నించారు. బుధవారం వెల్గటూర్‌లో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనపై పెట్టిన అవిశ్వాసం తీర్మానం వీగిపోవడంతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు, సహకరించిన ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఒకింత భావోద్వేగానికి గురై కంట తడిపెట్టుకున్నారు. ఒక దళిత మహిళ ఎంపీపీగా ఉంటే గిట్టక కొందరు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌కు తొత్తులుగా మారి తనపై అవిశ్వాస తీర్మాణం ప్రవేశ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎంపీటీసీలను డబ్బులు ప్రలోభపెట్టి తనను ఎంపీపీ పదవి నుంచి తప్పించడానికి విఫలయత్నం చేసిన వారికి తన ఉసురు తగులుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ గోలి రత్నాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, జూపాక కుమార్, సత్యం, నర్సింగారావు, రియాజ్, గంగుల నగేష్ పాల్గొన్నారు.

పోలీస్ భద్రతా చెక్కు అందజేత

జగిత్యాల టౌన్, జనవరి 10 : కోడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు కుటుంబానికి పోలీస్ భద్రతా చెక్కును ఎస్పీ అందజేశారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా బుధవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో బాధిత కుటుంబానికి రూ. 80 వేల చెక్కును అందజేశారు. ఏవో అమర్నాథ్ ఉన్నారు.

●జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందాడు. శ్రీనివాస్ బుధవారం ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసారు. పదోన్నతి చిహ్నాన్ని అలకరించి ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేశారు. టౌన్ ఇన్స్‌పెక్టర్ నటేష్ ఉన్నారు.

ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ప్రారంభించండి

కేంద్ర మంత్రికి ఎంపీ అర్వింద్ లేఖ

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కేంద్ర విదేశీ వ్యవహరాల శాఖ మంత్రి జైశంకర్‌కు బుధ వారం లేఖ రాశారు. జగిత్యాల పరిసర ప్రాంతాలలో గణనీయమైన జనాభా ఉందని, ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉపాధి, ఉన్నత చదువుల నిమిత్తం తరుచుగా గల్ఫ్ దేశాలు, ఇతర దేశాలకు రాకపోకలు సాగిస్తుంటారని లేఖలో పేర్కొన్నారు. జగిత్యాలలో ప్రాంతీయ పాస్ పోర్టు కార్యాలయం లేకపోవడంతో నిజామాబాద్, కరీంనగర్ వంటి ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పాలవుతున్నా రని వివరించారు. ప్రాంతీయ పాస్ పోర్టు కేంద్రాన్ని జగిత్యాలలో ఏర్పాటు చే స్తే ప్రభుత్వం అందిస్తున్న సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని లేఖ లో ప్రస్తావించారు.

నీరటి రోబో ఇన్నోవేటర్ శ్రీనివాస్‌కు కలెక్టర్ ప్రశంస

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు విద్యుత్ షాక్ ప్రమాదాలకు గురికాకుండా ఆటోమెటిక్‌గా మోటార్ ఆన్ ఆఫ్ చేయడానికి గాలి, నీరు ఆధారంగా పనిచేసే ఎమ్మెస్ నీరటి రోబోను తయారు చేసిన ఇన్నోవేటర్ మెండె శ్రీనివాస్‌ను కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ప్రశంసించారు. బుధవారం జిల్లా కేంద్రం శివారులోని పొలాస వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జరిగిన కిసాన్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శనలో నీరటి రోబో స్టాల్‌ను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీరటి రోబో రైతులకు, పరిశ్రమ వేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ డైరెక్టర్ సుధారాణి, సీఈవో కల్పనాశాస్త్రీ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత

జగిత్యాల టౌన్, జనవరి 10 : జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా అపహరణకు గురవుతున్న ద్విచక్ర వాహనాల దొంగను పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజు అనే యువకుడు జిల్లా కేంద్రంలో అద్దెకు ఉంటూ వ్యసనాలకు బానిసయ్యాడు. ఈజీగా డబ్బులు సంపాదించేందుకుగాను దొంగగా మారాడు. ఈదే క్రమంలో పట్టణంలో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసి పారిపోయే క్రమంలో పట్టణ పోలీసులు పట్టుకని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద మూడు ద్విచక్ర వాహ నాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎన్ఆర్ఐ కన్వీనర్‌గా మంద భీంరెడ్డి

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రవాస భారతీయుల విభాగం (టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్) కన్వీనర్‌గా వలస వ్యవహారాల విశ్లేషకులు, ప్రముఖ ప్రవాసి కార్మిక నాయకుడు మంద భీంరెడ్డిని నియమిస్తూ టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ బి.ఎం వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు బుధవారం హైద్రా బాద్‌లో జగిత్యాలకు చెందిన భీంరెడ్డి నియామక పత్రాన్ని అందుకున్నారు. ప్రవాసి భారతీయ దివస్ సందర్భంగా నియామకాన్ని జరిపినట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నియామక పత్రం అందించిన కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ ఛైర్మన్ వినోద్ కుమార్‌కు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. భీంరెడ్డి నియామకం పట్ల గల్ఫ్ సంఘాల నాయకులు గుగ్గిల్ల రవి గౌడ్, రాజాగౌడ్, ధర్మేందర్, తిరుపతి గౌడ్, బోయిని సురేశ్ హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

సారంగాపూర్, జనవరి, 10 : మండలంలోని కోనాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాపాల మల్లవ్వ తన ఇంటిలో మల్లన్న దేవుని పూజ కార్యక్రమం చేసి దేవుని వద్ద దీపాలు పెట్టి కూలి పనులకు వెళ్లింది. ఈ క్రమంలో దీపాలతో ఇంట్లో ఉన్న వస్తువులకు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. చుట్టు పక్కల వారు గమనించి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న బియ్యం, విలువైన వస్తువులు కాలిపోయాయి, స్థానిక సర్పంచ్ ఆకుల జమున రాజిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు.

కలకలం రేపుతున్న చిరుత సంచారం

భయందోళనలో గ్రామస్థులు, రైతులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 10 : మండలంలోని సత్యక్కపల్లె గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోని వ్యవసాయ పొలాల వద్ద చిరుత పులి కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం కనిపించిన పాదం గుర్తులు హైనావా లేక చిరుత పులివా అనే అనుమానంతో ఉన్న ప్రజలకు బుధవారం ఉదయం గ్రామ శివారులో రైతులకు చిరుత కనిపించింది. దీంతో రైతులు, గ్రామస్థులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని ఉసికె గుట్ట అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న నీలి చిన్నారెడ్డి అను రైతు వ్యవసాయ తోటలో మూడు రోజుల క్రితం చిరుత పులి పాదం గుర్తులుగా భావించి గ్రామస్తులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డీఆర్వో మహ్మద్ హఫీజ్దిన్, బీట్ అధికారి శివరాజ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత పులి అడుగులు పరిశీలించారు. ఇది హైన(తోడేలు) జంతువు అడుగుల్లాగా ఉన్నాయని, చిరుత పులివి కాదని ఆందోళనకు గురికావొద్దని పేర్కొన్నారు. కానీ మళ్లీ మూడు రోజుల తరువాత ఉదయం గ్రామ శివారులో చిరుత పులి సంచరిస్తుండగా సమీపంలో ఉన్న స్థానికులు చూసి భయాందోళతో గ్రామస్థులకు, అటవీ అధికారులకు సమాచారం అందించారు. అధికారుల పరిశీలించినంతరం సాయంత్రం గ్రామ శివారులోని రైల్వే గేటు సమీపంలో చిరుత సంచరించడాన్ని రైతులకు కనిపించినట్లు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి సౌకత్‌అలి తన సిబ్బందితో వెళ్లి చిరుత సంచరించిన ఆనవాళ్లను పరిశీలించారు. రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ ప్రదేశంలో నిఘా పెడుతామని పలు సూచనలు చేశారు. చిరుతను చంపితే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఈయనతో నాయకులు నేరేళ్ల రాజాగౌడ్, డీఆర్వో మహ్మద్ హఫీజ్దిన్, బీట్ అధికారి శివరాజ్, సిబ్బంది గణేష్ పాల్గొన్నారు.



సత్తక్కపల్లిలోని రైతులకు సూచనలు ఇస్తున్న అటవీ శాఖ అధికారులు

అల్ఫోర్స్‌లో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అర్బన్, జనవరి 10: పట్టణంలోని స్థానిక విద్యానగర్‌లోగల అల్ఫోర్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ వేడుకలు నిర్వహించామన్నారు. పల్లె వాతావరణం ఉట్టిపడే రీతిలో చిన్నారుల వేషధారణల నడుమ ఈ వేడుకలు కొనసాగాయన్నారు. విద్యార్థులకు పండగల ప్రాశస్త్యం, విశిష్టతను తెలియజేసేందు కే పాఠశాలలో అన్ని రకాల పండగలను అట్టహాసంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల ప్రాంగణం సంక్రాంతి శోభను సంతరించు కుందని, సుమారు వంద మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో వచ్చి చేసిన ప్రదర్శనలు ఆహుతులను అలరించాయ న్నారు. నార్లు వేయడం, పిండివంటల తయారీ, గంగిరెద్దుల విన్యాసాలు, ఆట పాటలు, హరి దాసుల కీర్తనలు ఆహుతులను అలరించాయన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

●నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థినులకు ముందస్తు ముగ్గులపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేష్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్‌లు సంక్రాంతి విశిష్టతను వివరించారు.

'ప్రదర్శనలతో విద్యార్థుల్లో అభిరుచులు పెరుగుతాయి'

ధర్మపురి, జనవరి 10: విద్యా సంబంధించిన విషయాలపై ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శనలతో విద్యార్థుల్లో ఆయా అంశాల పట్ల అభిరుచులు పెరుగుతాయని ధర్మపురి మండల తహసీల్దార్ కృష్ణచైతన్య అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఆంగ్లో వేదిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంగ్లీష్, సోషల్ సబ్జెక్ట్‌లకు సంబంధించి విద్యార్థులు ఏర్పాటు చేసిన పలు ప్రదర్శనలను ఎస్ఐ దత్తాత్రితో కలిసి ఆయన తిలకించారు. అనంతరం ఆయన పలు ప్రదర్శనలు, చిత్రాలను, నమూనల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై లోతైన అవగాహన కల్పించడం కోసం ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. వివిధ సబ్జెక్టులలోని కఠినమైన అంశాలను సైతం సులువుగా నేర్చుకునే వీలు కలుగుతుందని ఆయన తెలిపారు. దీంతో విద్యార్థుల్లో అనేక అంశాల పట్ల జిజ్ఞాస, పలు రకాల నైపుణ్యాలు సైతం పెరుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దత్తాత్రి, పాఠశాల కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వెల్గటూర్, జనవరి 10: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార రథం బుధవారం రాజక్కపల్లికి చేరింది. ప్రధాని మోదీ దేశంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వీడియో స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించారు. బీజేపీ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో గ్రామీణులకు బ్యాంక్ ఖాతాలు సరిగా ఉండేవి కావని జీరో బ్యాలన్స్‌తో ప్రతీ ఒక్కరికి జన్‌ధన్ ఖాతా అందించిన ఘనత ప్రధాని మోదీకి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్ కల్యాణి, అంజి చిన్నక్క చంద్రమౌళి, శివకుమార్, సురేష్, రాములు పాల్గొన్నారు.

మల్యాల ఎంపీపీపై అవిశ్వాసం వాయిదా

- కోర్టు స్టేతో నిలిచిన ప్రక్రియ
- మళ్లీ క్యాంప్‌నకు తరలివెళ్లిన ఎంపీటీసీలు

మల్యాల, జనవరి 10: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం సభ్యులు హాజరు అయినప్పటికీ వాయిదా పడింది. ఎంపీపీ విమల హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో బుధవారం జరగాల్సిన అవిశ్వాస ప్రక్రియ నిలిచిపోయింది. మళ్లీ కోర్టు ఉత్వర్వుల మేరకు సమావేశం నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపీపీ విమలపై గత నెల 20న జగిత్యాల ఆర్డీవోకు వైస్ ఎంపీపీ పోతాని రవి (ముద్దుట్ల), క్యాతం పద్మ(రాంపూర్), మారంపల్లి నర్స వ్వ(రాజారం), కట్కూరి నవత (లంబాడిపల్లి) కాంగ్రెస్‌కు చెందిన దొంగ అనిత(తాటిపల్లి), మరాటి సంజన (తక్కళ్లపల్లి) ఆగంతపు రవళి(మల్యాల-1), సఫియాభేగం(రామన్నపేట) బీజేపీకి చెందిన ముదుగంటి వనిత(మ్యాడంపల్లి), కొల్లూరి గంగాధర్ (పోతారం) ఎంపీటీసీలు అవిశ్వాసం నోటీస్ అందజేశారు. ఇందులో లంబాడిపల్లి ఎంపీటీసీ ప్రస్తుతం ఎంపీపీ వర్గంలో ఉండగా బల్వంతాపూర్ ఎంపీటీసీ అవిశ్వాసం ప్రకటించిన వారితో ఉన్నారు. అవిశ్వాస నోటీస్ నేపథ్యలంలో ఆర్డీవో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీవో నర్సింహమూర్తి నిర్వహించిన సమావేశానికి పది మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. అయితే ఎంపీటీసీ రవళి దాఖలు చేసిన కేవియట్‌పై ఎంపీపీ విమల కోర్టు స్టే తీసుకువచ్చారని దీంతో నేటి సమావేశం మళ్లీ కోర్టు ఆదేశాలు వచ్చే వరకు వాయిదా వేస్తున్నట్లు ఆర్డీవో ప్రకటించారు. దీంతో సమావేశం నుంచి సభ్యులు బయటకు వచ్చి మళ్లీ క్యాంప్‌నకు వెళ్లారు. బీఆర్ఎస్, బీజేపీ ఎంపీటీసీ సభ్యులకు ఆయా పార్టీలు విప్ జారీ చేసినప్పటికీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆర్డీవోతో పాటు ఎంపీడీవో వెంకటేశం, తహసీల్దార్ మునీందర్ ఉన్నారు.



సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఆర్డీవో

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ 78 శాతం పూర్తి

జగిత్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, జిల్లా పంచాయతీ అధికారి, ప్రజాపాలన నోడల్ అధికారి దేవరాజ్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారుడేటా ఎంట్రీ పకడ్బందీగా, తప్పులు లేకుండా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,32,601 దరఖాస్తులకు గాను 2,60,841 దరఖాస్తుల డేటా ఎంట్రీ పూర్తయిందన్నారు. ఇంకను 71,760 దరఖాస్తులను పూర్తి చేయాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన కార్యక్రమంలో అభయ హస్తం కాకుండా ఇతర సమస్యలపై 62,305 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్

జగిత్యాల టౌన్, జనవరి 10 : జగిత్యాల కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఇటీవల పట్టణానికి చెందిన త్రిపుర నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. అనంతరం పీపీని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలుడిని పనిలో పెట్టుకున్న వ్యాపారిపై కేసు

గంగాధర, జనవరి 10: బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు గంగాధరలో ఓ వ్యాపారిపై బుధవారం జువైనల్ యాక్ట్ కేసు నమోదైంది. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ప్రత్యేక బృందం గంగాధరలో తనిఖీలు చేపట్టింది. కిరాణ దుకాణంలో పనిచేసున్న 14 సంవత్సరాల బాలుడిని అధికారులు గుర్తించారు. బృందంలో సభ్యుడైన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు జువనైల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం 374ఐపీసీ ప్రకారం దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అనంతరం బాలుడిని జిల్లాలోని బాలల సమితి ముందు ప్రవేశపెట్టి బాలుడి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిసింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెగడపల్లి, జనవరి 10: గంజాయి రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని బుధవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సీహెచ్. సతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం గంజాయి సరఫరా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పెగడపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మల్యాల సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పెగడపల్లి ఎస్ఐ సతీష్ పోలీస్ సిబ్బందితో కాపుకాసారు. అనుమానాస్పదంగా కనిపిం చిన వ్యక్తి వద్ద హ్యాండ్ బ్యాగ్ తనిఖీ చేయగా అందులో 1.720 కిలోలు గంజాయి లభించింది. దాని విలువ దాదాపు రూ.35 వేలు ఉంటుందని పోలీ సులు తెలిపారు. గంజాయి తరలిస్తున్న రాచర్ల వంశీ (22) వద్ద నుంచి గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కోటేశ్వర్ తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన అప్పాల మహేష్‌పై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేం దర్ తెలిపారు. బుధవారం మహేష్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు భర్త మహేష్‌తో పాటు అత్త దేవలక్ష్మి, మామ శంకరయ్య, కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వివాహమై 5 సంవత్సరాలు గడిచినప్పటికీ అదనంగా రూ.5 లక్షలు వరకట్నం తేవాలని మానసికంగా వేధించడంతో గృహహింస కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 10: సిరిసిల్ల పట్టణంలోని ఓ రైస్‌మిల్లులో క్వింటాల్ రేషన్ బియ్యం విక్రయించేందుకు వస్తున్న వేములవాడకు చెందిన బి రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు. వేములవాడలో సేకరించిన క్వింటాల్ రేషన్ బియ్యాన్ని టీవీఎస్ చాంప్‌పై తీసుకవస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

ధర్మపురి, జనవరి 10: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామంలో అనుపురం లక్ష్మి(66) అనే వృద్ధురాలు బుధవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె రాత్రి వేళలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఉదయం కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా తన వ్యవసాయ బావిలో శవమై తేలింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి శవాన్ని బయటకు తీయించారు. మృతురాలి కొడుకు తిరుపతి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ దత్తాత్రి ఆధ్వర్యంలో హెచ్‌సీ ఎండీ సలీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చైల్డ్ పోర్న్ వీడియోలు
షేర్ చేసిన వ్యక్తి రిమాండ్

వేములవాడ రూరల్, జనవరి 10: చైల్డ్ పోర్న్ వీడియోస్ షేర్ చేసిన వ్యక్తిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన మల్యాల అరవింద్ చైల్డ్ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేసి సోషల్ మీడియా ద్వారా ఇతరులకి షేర్ చేస్తున్నాడని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీస్ నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. ఈ మేరకు రూరల్ ఎస్సై మారుతి మంగళవారం సాయంత్రం చెక్కపల్లి శివారులోని పెద్దమ్మతల్లి గుడి వద్దకు వెళ్లగా అరవింద్ పారిపోవడానికి ప్రయత్నించాడని, వెంటనే పట్టుకొని అతడి ఫోన్ పరిశీలించగా అశ్లీల చిత్రాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. అరెస్టు చేసి విచారించగా అశ్లీల చిత్రాలను డౌన్ లోడ్ చేసి ఇతరులకు షేర్ చేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపాడన్నారు. దీంతో కేసు నమోదు చేసి రూరల్ సీఐ కృష్ణకుమార్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. చైల్డ్ పోర్న్ వీడియోస్ చూసినా, డౌన్‌లోడ్ చేసినా కఠిన చర్యలుంటాయని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి వారిపై సైబర్ సెక్యూరిటీ పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని పేర్కొన్నారు.

తోట నిర్మలారాణికి అలిశెట్టి పురస్కారం


తోట నిర్మలారాణి

కరీంనగర్ కల్చరల్, జనవరి 10: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో అందించే అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి కరీంనగర్ కాపువాడకు చెందిన రచయిత్రి తోట నిర్మలారాణికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఫిలింభవన్‌లో అందజేయనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కవి, విమర్శకుడు సీతారాం, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, తెరవే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వేంకటేశ్వర్లు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

రాజన్నకు భక్తుల మొక్కులు

వేములవాడ టౌన్, జనవరి 10: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం భక్తుల సాధరణ రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలను సమర్పించారు. అనంతరం ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించి రాజన్నను దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన మల్లికార్జున స్వామి జాతర

గొల్లపల్లి, జనవరి 10: మండలంలోని మల్లన్నపేట గ్రామంలో ఏడు వారాలుగా జరుగుతున్న శ్రీ మల్లిఖార్జున స్వామి జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం చివరి రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి తమ ఇష్ట దైవానికి బోనాలు సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు కొండూరు రాజేందర్ శర్మ, కొండూరు రఘునందన్ శర్మ వేద మంత్రోచ్ఛరణల నడుమ మల్లిఖార్జున స్వామికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఎంపీటీసీ గోస్కుల రాజన్న, ఉప సర్పంచ్ బేర కిషోర్, ఆలయ ఈవో విక్రమ్, ఆలయ ఫౌండర్ ట్రస్ట్ కొండూరు శాంతయ్య ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జాతర ఉత్సవాల్లో భాగంగా జగిత్యాల జడ్పీ సీఈవో రఘువరన్ జాతర చివరి రోజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కన్నుల పండువగా వీరభద్రస్వామి కల్యాణం

తలంబ్రాలు తీసుకువచ్చిన మంత్రి పొన్నం దంపతులు

భీమదేవరపల్లి, జనవరి 10: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి కల్యాణం.. కమణీయం..రమణీయంగా వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య బుధవారం కన్నుల పండువగా జరిగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్-మంజుల దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాది మంది భక్తుల సమక్షంలో కన్నుల పండువగా పల్లకిలో తీసుకువచ్చారు. స్వామివారి పుష్కరిణి పక్కన గల కల్యాణ మండపంలో కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని కొత్తకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి కొత్తకొండ, ముస్తాఫాపూర్, ధర్మారం, చంటయ్యపల్లి, గొల్లపల్లి, గట్లనర్సింగాపూర్, తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారి కల్యాణాన్ని తిలకించి పులకించిపోయారు. ఆలయ ఈవో కిషన్‌రావు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసందర్భంగా భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్, వంగర ఎస్‌ఐలు సాయిబాబు, నీలోజు వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ మేరకు స్వామివారి కల్యాణానికి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలన్ని కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, మంజులారెడ్డి, ఎంపీపీ జక్కుల అనిత-రమేష్, జడ్పీటీసీలు వంగ రవి, మాజీ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, ఆర్ వెంకట్‌రెడ్డి, పిడిశెట్టి కనుకయ్య, కాసం రమేష్‌గుప్తా, సర్పంచ్‌లు దూడల ప్రమీల-సంపత్, రొంటాల ప్రభాకర్, గుంటి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.


కొత్తకొండలో శ్రీవీరభద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

డిగ్రీ పరీక్షల్లో 8 మంది డీబార్

గణేశ్‌నగర్, జనవరి 10: శాతవాహన విశ్వవిద్యాలయం డిగ్రీ ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 8మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. సెమిస్టర్-1లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, శ్రీశివాని డిగ్రీ కళాశాల సిరిసిల్లలో-1, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటలో-4, అపూర్వ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో-1, మూడో సెమిస్టర్‌లో శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

కోనరావుపేట, జనవరి 10: నకిలీ గల్ఫ్ ఏజెంట్‌గా చలామణి అవుతూ ఓ ఇద్దరి వ్యక్తులను గల్ఫ్ దేశం పంపిస్తానని మోసం చేసిన నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్టు చేసి బుధవారం రిమాండ్ పంపినట్లు కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రుద్రంగి మండల కేంద్రంలోని బాలాజీ ట్రావెల్స్ యజమాని ధరావత్ విట్టల్, నిమ్మపల్లి గ్రామానికి చెందిన విక్రుతి రాజు, దొంతరవేణి మహేష్‌లను గల్ఫ్‌దేశం పంపిస్తానని చెరో లక్ష రూపాయలు తీసుకొని నకిలీ వీసా ఇచ్చి మోసం చేయడంతో అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.

డీ8 ఉపకాలువకు మరమ్మతు పనులు

గన్నేరువరం, జనవరి 10: మండలంలోని ఖాసింపేట నుంచి మాదాపూర్‌కు వెళ్లే డీ8 ఉపకాలువలో పిచ్చి మొక్కలు, మట్టి కూరుకుపోవడంతో గత సంవత్సరం నుంచి రైతులకు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం కెనాల్‌లోని చెట్లు, మట్టిని తొలంగించే పనుల ప్రారంభించారు. ఎంపిపి లింగాల మల్లారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మెర రవిందర్‌రెడి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

రమేష్‌బాబు పౌరసత్వం కేసు విచారణ వాయిదా

వేములవాడ టౌన్, జనవరి 10 : తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో వేములవాడ మాజీ శాసనసభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు కేసు బుధవారం విచారణ జరిగింది. ఈ మేరకు సుదీర్ఘ వాదనల అనంతరం రమేష్‌బాబు తరపు న్యాయవాదులను పూర్తి వివరాలతో రావాలని, కేసును తిరిగి శుక్రవారం వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపిందని ఆది శ్రీనివాస్ తరుపు న్యాయవాదులు పేర్కొన్నారు.

దొంగతనం కేసులో ఆరుగురి అరెస్టు

అంతర్గాం, జనవరి 10: విధుల్లో ఉన్న రైల్వే ఉద్యోగిని బెదిరించి రైల్వే ఆస్తిని దొంగిలించిన కేసులో ఆరుగురిని బుధవారం అరెస్టు చేసినట్లు రామగుండం రైల్వే ప్రొటెక్షన్స్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. డిసెంబరు 14న అంతర్గాం మండల పరిధిలోని విలేజి అంతర్గాం శివారు గోదావరి రైల్వే బ్రిడ్జి వద్ద ట్రాక్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం పవన్ కుమార్‌ను మంచిర్యాలకు చెందిన కడమంచి మహేష్, కడమంచి శ్రీను, చింతల శేఖర్, వనరాశి మల్లేష్, ఇగ్గన నగేష్, వనరాశి ఉప్పలయ్య బెదిరించి మెటీరియల్‌ను దొంగిలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని దొంగిలించబడిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ పేర్కొన్నారు. రైల్వే ఆస్తులను దొంగిలించినా, ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఐలయ్య, సుమన్, ఓంవీర్ పాల్గొన్నారు.


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్

బెల్టు షాపులపై పోలీసుల దాడులు

● రూ, 12,380ల మద్యం సీజ్ ● కేసు నమోదు

సైదాపూర్, జనవరి 10: సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, రాయికల్ గ్రామాల్లో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.12,380ల మద్యం సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సైదాపూర్ ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వెన్నంపల్లి, రాయికల్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. వెన్నంపల్లి గ్రామానికి చెందిన తోట రవి బెల్టు షాపులో రూ. 2580, రాయికల్ గ్రామానికి చెందిన బత్తిని రాజయ్య బెల్టు షాపులో రూ. 9,800ల మద్యం పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 10: ఎల్లారెడ్డిపేట మండల శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేటకు చెందిన యువకుడు కిషోర్‌తో పాటు మరో యువకుడు కుల్‌దీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కిషోర్, కుల్‌దీప్‌కుమార్ బైక్‌పై పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా గొల్లపల్లి నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ట్రాలీ ఆటో ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుల్‌దీప్‌కుమార్ పరిస్థితి విషమంగా మారడంతో సిరిసిల్లకు తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ చెట్టుకు ఢీకొని డ్రైవర్ మృతి

మానకొండూర్, జనవరి 10: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో బుధవారం చెట్టుకు ట్రాక్టర్ ఢీకొని డ్రైవర్ మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన నందగిరి సాయినంద్ (26) అనే యువకుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జగ్గయ్యపల్లి నుంచి కూలీలతో ట్రాక్టర్‌లో శ్రీనివాస్‌నగర్ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఓ వాహనాన్ని తప్పించబోయి పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సాయినంద్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరి తిరుమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తూ పూరి గుడిసె దగ్ధం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 10: మండలంలోని తారుపల్లి గ్రామానికి చెందిన దోబుల మొగిలికి చెందిన పూరి గుడిసె ప్రమాదవశాత్తు నిప్పంటుకుని బుధవారం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో విలువైన సామగ్రితో పాటు టేకు దుంగలు, రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయి. గుడిసెలో ఉన్న గేదె, గేదె పిల్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఇంటి యజమాని మొగిలి తెలిపారు. సంఘటన స్థలాన్ని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఆర్‌ఐ నర్సింగం పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గుడిసెలో ఉన్న విలువైన వస్తువులతో పాటు రెండు బైకులు పూర్తిగా కాలిపోయాయని, ప్రమాదం జరిగినప్పుడు గుడిసెలో ఉన్న గేదెలకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదాసి సతీష్, నకినపల్లి స్వామి, దోబుల మోహన్‌రావు, దోబుల మల్లయ్య, అంజన్న పాల్గొన్నారు.

రైతు వేదికలో ప్రైవేట్ కంపెనీ కార్యక్రమం

శంకరపట్నం, జనవరి 10: శంకరపట్నం మండలం కన్నాపూర్ క్లస్టర్ రైతు వేదికలో ఓ ప్రైవేట్ పెస్టిసైడ్ కంపెనీ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ రైతు వేదికలో ప్రైవేట్ కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తారని కొంత మంది స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రైవేట్ కంపెనీ బుధవారం రైతు వేదికలో పెస్టిసైడ్స్ ప్రమోషన్ కార్యక్రమం నిర్వహించడానికి స్థానికంగా ఉండే రైతులను పెద్ద సంఖ్యలో పోగు చేసి కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా తన అనుమతి లేకుండానే కార్యక్రమం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి ఇవ్వలేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 10 : కరీంనగర్ రూరల్ మండలం సీతారాంపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న బత్తిని శ్రీకాంత్(25) అనే యువకుడు కడుపునొప్పి భర్శిలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కొత్తపల్లి ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ భార్య, పిల్లలతో సహా గత కొద్ది రోజులుగా సీతారాంపూర్‌లో ఉంటూ ఒక గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల నుంచి అతను కడుపునొప్పితో బాధపడుతూ ఆర్‌ఎంపీ వద్ద గోళీలు తెచ్చుకుని వాడకుంటుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. బుధవారం ఉదయం 9 గంటలకు కడుపునొప్పి వస్తుందని పడుకుంటానని చెప్పి గదిలోకి వెళ్లి కొద్దిసేపటికి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడని, వెంటనే భార్య, తల్లిలు కలిసి ఉరినుంచి శ్రీకాంత్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రకృతి వనం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఇల్లందకుంట, జనవరి 10: మండలంలోని ఎర్రగట్టు గుట్ట సమీపంలోని బోగంపాడు, సిరిసేడు గ్రామాల ప్రకృతి వనాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను వెంటనే శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసం చేసిన ప్రకృతి వనాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదనే అనుమానం వస్తోందన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు చోద్యం చేస్తూ వారికి సంబంధం లేనట్లుగా వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో అజ్జర్, బోగం శ్యామ్, మురహరి నరేందర్, రేణుకుంట్ల సారయ్య, మర్రి సాయి, రేణుకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, జనవరి 10 : ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు బుధవారం ఉదయం 4:30 గంటలకు మానేరు బైపాస్ రోడ్‌లో ఇసక ట్రాక్టర్‌ను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ శివరాత్రి కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే కట్టరాంపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి ఇసుక ట్రాక్టర్‌ను బ్లూకోల్ట్స్ పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. డ్రైవర్ లోకిని రమేష్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, జనవరి 10: రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల్లో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన నాయకులకే కాకుండా అన్ని జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో పనిచేసిన ఉద్యమకారులను గుర్తించి ప్రాధాన్యం ఇవ్వాలని టీజేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని, ప్రజల పక్షాన ఉద్యమించిన వారిని గుర్తించాలని కోరారు.


కొండగట్టు హుండీ లెక్కింపులో చేతివాటం

● రూ. 11,010 అపహరణ ● నిందితుడిని పోలీసులకు అప్పగించిన దేవస్థానం అధికారులు

మల్యాల, జనవరి 10: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీలను బుధవారం లెక్కింపు చేపట్టగా ఆలయ ప్రసాదాల తయారీలో పని చేసే తాత్కాలిక ఉద్యోగి ఒకరు నగదు దొంగిలించాడు. లెక్కింపు సందర్భంగా ఆలయంలోని హుండీలను విప్పి సంచులతో అందులోని డబ్బులను తీసుకువచ్చి ప్రాకార మండపంలో లెక్కింపు చేస్తుంటారు. అయితే లెక్కింపునకు ముందు నాణేలను, నగదును వేరు చేస్తారు. వేరు చేసే క్రమంలో ప్రసాదాల తయారీ సిబ్బంది కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన కొలగాని రవి అనే సిబ్బంది రూ.500నోట్లు 11తో పాటు రూ. 10 అందులో నుంచి తీసి దాచుకోవడంతో అక్కడ లెక్కింపునకు వచ్చిన భక్తుడు ఒకరు చూసి అధికారులకు సమాచారం అందించాడు. దీంతో అక్కడే గల ఉమ్మడి కరీంనగర్ దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, ఈవో వెంకటేష్ వెంటనే అతన్ని అక్కడి ఏఎస్సై చిలుక శ్రీనివాస్‌తో పాటు పోలీసులకు అప్పగించి నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈవో ఫిర్యాదు మేరకు పోలీసులు రవిపై కేసు నమోదు చేశారు.

● పర్యవేక్షణ అంతంత మాత్రమే

భక్తులు సమర్పించే డబ్బులు, బంగారు, వెండి కానుకల లెక్కింపు, తూకంపై ఏళ్లుగా ఆరోపణలు ఉన్నాయి. లెక్కింపు సమయంలో సిబ్బంది చేతివాటంకు పాల్పడిన సంఘటనలు ఉండగా కౌంటింగ్ ప్రక్రియపై తరచూ విమర్శలు వస్తూనే ఉన్నాయి. హుండీల కౌంటింగ్ సందర్భంగా దేవస్థానం అధికారులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, సీసీ కెమెరాల పర్యవేక్షణలో దేవస్థానం అధికారులు, పోలీసుల సమక్షంలో కౌంటింగ్ చేపడుతుంటారు. పర్యవేక్షణ పకడ్బందీగా లేక తరచూ దొంగతనాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. గతంలో హుండీ లెక్కింపు సమయంలో చోరీ ఘటనలు జరిగినా పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం రూ.71.73 లక్షలు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 35 రోజులకు హుండీల ద్వారా రూ.71,73,723 నగదు దేవస్థానంకు సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 51 గ్రాముల మిశ్రమ బంగారం, 3.200కిలోల మిశ్రమ వెండి, 30 విదేశి కరెన్సీ లభించినట్లు ఈఓ పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు


సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు


ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్


ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని


ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి


ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సినీనటి అనన్య


ముగ్గులు వేస్తున్న మహిళలు



అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ

ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో రఘునందన్

గొల్లపల్లి, జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి స్వీకరించిన ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఫీడింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో రఘువరన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్పీ సీఈవో గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ఫీడింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. 88 శాతం ఫీడింగ్ చేయడం పై అధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో చేసిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యాలయం రికార్డులు, రిజిష్టర్‌లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నవీన్ కుమార్, ఎంపీవో సురేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రవీందర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

25 నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్‌టోర్నీ

మల్యాల, జనవరి 10: ఈ నెల 25 నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌ను కొండగట్టులో నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఈ మేరకు వన్ క్రికెట్ లీగ్ పోస్టర్‌ను మల్యాలలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ప్రవేశ రుసుము రూ.2500 కాగా ఉమ్మడి జిల్లా నుంచి అధికంగా క్రికెట్ టీం లు పాల్గొనాలని కోరారు. క్రికెట్ టోర్నీ ముగింపు రోజు విజేతలకు ఇండియా క్రికెట్ టీం మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ అందజేస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9030737183, 7799127748లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నెరెళ్ల సతీష్‌రెడ్డి, కట్కం వినయ్, అనిల్,పాల్గొన్నారు

రైస్ మిల్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

ఇబ్రహీంపట్నం, జనవరి 10: 'అడ్డదారిన ధాన్యం కేటాయింపు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని శ్రీ వెంకటలక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్ రైస్ మిల్‌లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధి కారులు తనిఖీలు నిర్వహించారు. నూతనంగా నిర్మాణం చేపడుతున్న మిషనరీ పనులను, విద్యుత్ సౌకర్యం, గోదాంలో ధాన్యం నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం రైస్ మిల్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ ప్రభాకర్ మాట్లాడుతూ రైస్‌మిల్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. 22,050 క్వింటాళ్ల ధాన్యం కేటాయించామని ధాన్యం బస్తాలలో ఎలాంటి తేడాలు లేవన్నారు. పూర్తి స్థాయిలో రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామన్నారు. అసలు రైస్ మిల్ పూర్తి కాకుండానే ధాన్యం కేటాయించడంపై ఓఎస్‌డీ ప్రభాకర్‌ను ప్రశ్నించగా అది డీఎస్‌వో పరిధి అంటూ దాటవేయడం గమనార్హం. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐలు కృష్ణ, జంగయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో 68వేల రికవరీ: డీఆర్డీవో

ఇబ్రహీంపట్నం, జనవరి 10: జాతీయ గ్రామీణ ఉపాధి పనులలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీఓ నరేష్ హెచ్చరించారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ 14వ విడత ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీలు ఆయా గ్రామాల సోషల్ అడిట్, అవకతవకలకు సంబంధించి నివేదికలను సమర్పించారు. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్డీవో హెచ్చరించారు. సోషల్ అడిట్‌లో భాగంగా మండలంలో అన్ని గ్రామాల నుంచి రూ. 68844లు రికవరీకి అదేశించినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారి చిన్నయ్య, ఎంపీఓకృపాకర్ పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాయకుల కల్యాణం

మెట్‌పల్లి, జనవరి 10: పట్టణంలోని బోయవాడ కాలనీలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వాహకులు వైభవంగా జరిపించారు. భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో ఆలయా భివృద్ధి కమిటీ అధ్యక్షుడు పర్శి నర్సయ్య, ఆర్మూర్ నరేందర్, తోపారం నాగయ్య, ప్రోహర్ హేమచందర్, పురుషోత్తం, లవ్‌కుమార్, తోపార రాజేందర్, ఆర్మూర్ పోచయ్య, లోకేష్, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్‌లోని రామాలయంలో గోదాదేవి రంగనాయకుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బోగ వందన-గంగాధర్, నాయకులు కొమ్ముల రాజ్‌పాల్ రెడ్డి, ఇల్లెందుల శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వహకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జనవరి, 10: ఎన్నికల సందర్భంగా నియోజక వర్గంలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషాను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్‌లను మర్యాద పూర్వకంగా ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలోని సమస్యలు, నిలిచిన అభివృద్ధి పనులపై వారికి వినతి పత్రాలను అందజేశారు. నియోజక వర్గంలో న్యాయ వ్యవస్థను మరింత పటిష్టం చేసి ప్రజలకు రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా పనులు చేద్దాం

అభివృద్ధే లక్ష్యంతో నియోజకవర్గంలోని పనులను త్వరగా పూర్తి చేయడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం ఆరపేటకు చెందిన బాజిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా లక్ష రూపాయల గల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అబివృద్ధి పనులను అధికారుల సహాయంతో త్వరగా పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. నియోజక వర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇబ్బందులు ఉంటే నేరుగా తన దృష్టి తీసుకొస్తే పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. వైద్య సమస్యలు ఉంటే నేరుగా ప్రజలు తనను కలవాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ చికిత్స చేయించకోలేని వారికి ప్రభుత్వం తరపున సాధ్యమైనంత వరకు సేవలు అందించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లంక గంగాధర్, ధ్యావనపల్లి రాజారాం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

విశ్వాసం కోల్పోయాక స్టే సరికాదు

మల్యాల, జనవరి 10: ఎంపీపీ విమల తమ విశ్వాసం కోల్పోయాక కూడా పదివి కాపాడుకోవడానికి కోర్టు స్టే తీసుకురావడం విడ్డూరంగా ఉందని అవిశ్వాసం ప్రకటించిన ఎంపీటీసీలు పేర్కొన్నారు. అవి శ్వాస ప్రత్యేక సమావేశం వాయిదా పడిన అనంతరం విలేఖరులతో మాట్లాడారు. స్టే తెచ్చుకొని పదవి కాపాడుకోవడం తాత్కలికమేనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ముందుకు వెలుతామని ఎంపీటీసీలు రవి, రవళీ, అనిత, సఫీయభేగంవలీ, వనిత స్పష్టం చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కథలాపూర్, జనవరి 10 : మండల కేంద్రంలో బుధవారం సీపీఎస్ యూనియన్‌కు సంబంధించిన నూతన సంవత్సర కేలండర్‌ను సీపీఎస్ నాయకులు ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి మేడిపల్లి సాయిరెడ్డి, స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ లోకిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు పరిశీలన

ధర్మపురి, జనవరి 10: ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మండల ప్రత్యేక అధికారి ఎండీ రహమాన్ బుధవారం పరిశీలించారు. మండలంలో ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ప్రజ ల నుంచి అభయ హస్తం గ్యారెంటీ పథకాల కోసం సుమారు 14,574 దరఖాస్తులు స్వీకరించా రు. దరఖాస్తులకు సంబంధించిన వ్యక్తుల డాటాను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్ నమోదు చేయడం ఆరంభించారు. మధ్యాహ్నం వేళలో మండల ప్రత్యేక అధికారి రహమాన్ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు.

ఎంత మంది వ్యక్తులకు సంబంధించిన డాటా ఎంట్రీ చేశారని, నమోదు ఎలా జరుగుతుందని ఆయన అడిగి తెలుసకున్నారు. నిర్ణీత గడువులోగా ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయా లని ఆదేశించారు. ఇదిలా ఉండగా ధర్మపురి మున్సిపల్ పరిధిలో గల 15 వార్డుల నుంచి అభ య హస్తం గ్యారెంటీ పథకాల కోసం 4922 దర ఖాస్తులు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుదారుల డాటను కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ధర్మపురి మున్సిపల్ కమీషనర్ సీహెచ్ రమేష్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ధర్మపురి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నరేష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ గంగాధర్, సీనియర్ అసి స్టెంట్ అజయ్‌కుమార్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీధర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు

మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రానావేణి సుజాత

మెట్‌పల్లి, జనవరి, 10: కార్మికులను అడ్డం పెట్టుకొని చిల్లర రాజకీయాలు చేయొద్దని మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ హితవు పలికారు. బుధవారం మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లుతో కలిసి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే మున్సిపల్ సొమ్ముతో వాహనాలలో డిజిల్ పోయించుకున్నారని అసత్య ఆరోపణాలు చేయడం వారి దిగజారుడుకు నిదర్శనం అని విమర్శించారు. పట్టణంలోని ప్రజల సౌకర్యం కోసం వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటు కోసం ఆలోచించి ఖాదీ బోర్డు స్థలాన్ని చైర్మన్ లీజ్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. లీజ్‌కు సంబంధించిన డబ్బును రెండున్నర సంవత్సరాలుగా ఖాదీ బోర్డుకు చెల్లించడం లేదని ప్రతిక్ష పార్టీలు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఓజ్జల బుచ్చిరెడ్డి, బంగారు కాళ్ల కిషోర్, లంక గంగాధర్, మురపు గంగాధర్, మన్నేఖాన్, రాజారాం, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, హన్మండ్లు, జియా పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

మల్యాల: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి మల్యాలకు చెందిన సైనికులు కీసరి గణేష్, ఒడ్డె నరేష్, గూడూరి లక్ష్మన్‌రెడ్డి, అనిల్, ఎనుగంటి అనిల్, గంగిపల్లి దినేష్, జుట్టు పవన్, నల్లాల మహేష్, రాజు, గవాస్కర్, అవినాష్, రంజిత్ బియ్యం, పప్పు దినుసులు, పెన్నులతో పాటు ఫ్యాన్ అందించారు.

కొడిమ్యాల: టీపీసీసీ సభ్యుడు గోగూరి మహిపాల్‌రెడ్డి తల్లి గోగూరి ఎల్లవ్వ మండలంలోని సంద్రల్లపల్లి గ్రామంలో మంగళవారం మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం పరామర్శించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామశివారు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమచారం మేరకు మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలోని మగ్గిడి (గొల్లపల్లి) గురుకుల పాఠశాల విద్యార్థి ఎన్ చందు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. కామారెడ్డిలో ఈ నెల 12 న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చందు పాల్గొంటారు.

బీర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పూదూరి రవి, కొమ్ము వేణు జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

రాయికల్: పట్టణంలోని బాలికల పాఠశాలలో ప్రజా చైతన్య వేదిక వ్యవస్థాపకుడు చింతకుంట సాయి కుమార్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మహాత్మ సావిత్రి బాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ బాలుర, బాలికల, ఉర్దూ మీడియం, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్యాడ్‌లను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మ్యాకల అనురాధ, కౌన్సిలర్ తురగ శ్రీధర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: శ్రీ రామ జన్మభూమి అయోధ్య నందు పూజింపబడిన అక్షింతలను మండలంలోని జగ్గసాగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు.

ఎండపల్లి : అయోధ్య రామ అక్షింతలను బుధవారం మండలంలోని మా రేడుపల్లి గ్రామంలో రాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. అర్చకులు రఘునాథ స్వామి ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ చేశారు.

కొడిమ్యాల: మండలంలోని నమిళికొండ గ్రామ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 13, 14 తేదీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల స్మారక విలేజీ టు విలేజ్ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జట్ల పేర్లను వి. శ్రీనివాస్ సెల్ నెం 9963087090, ఇ. తిరుపతి సెల్ నెం 9550051822 నంబర్లలో నమోదు చేసుకోవాలిసిందిగా వారు కోరారు.

గొల్లపల్లి: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ టీ సాక్స్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో జన జాగృతి వేదిక గడ్డం రమేష్ కళా బృందం మండలంలోని మల్లన్నపేట జాతరలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై కళాజాతా నిర్వహించారు. సర్పంచ్ సిద్ధంకి నర్సయ్య, ఎంపీటీసీ గోస్కుల రాజన్న పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని బతికెపల్లిలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో మూడ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియ మాలు, సైబర్ మోసాలు, సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్ర జలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ సీహెచ్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.